

పెద్దపులి కలకలం!
రామన్నపేట మండల కేంద్రం శివారులో పెద్దపులి సంచారం కలకలం సృష్టిస్తోంది. - 8లో



మత్తు ఇంజక్షన్లకు బానిస
వైద్యుడి సిఫారసు లేకుండా మత్తు టాబ్లెట్లు, ఇంజక్షన్‌లు కలిగి ఉన్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. - 8లో



అధ్వానంగా రహదారులు
మోటకొండూరు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. - 9లో

న్యూస్‌రీల్

నేడు హైకోర్టు జడ్జి రాక

భువనగిరి క్రైం : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.శరత్ శనివారం భువనగిరికి రానున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టులో జరిగే న్యాయమూర్తుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం జిల్లా కోర్టు భవనాల నిర్మాణానికి నూతన కలెక్టరేట్ పక్కన కేటాయించిన స్థలాన్ని జడ్జి పరిశీలించనున్నారు.

చీడపీడల నివారణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

భూదాన్ పోచంపల్లి : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారి అఖిల భారతి చీడపీడలు, జీవన నియంత్రణ సమన్వయం కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలోని ఇంద్రియాల గ్రామంలో పర్యటించారు. రైతులు సాగు చేసిన పలు రకాల పంటలను పరిశీలించారు. చీడపీడల వల్ల పంటలకు కలిగే నష్టాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రామకృష్ణబాబు, అనిల్‌కుమార్, ఏతఓట భుక్య దేవ్‌సింగ్, నరేష్, శిరీష, పవిత్రన్ పాల్గొన్నారు.

4న 'కూరెళ్ల'కు రాష్ట్ర ప్రభుత్వ సత్కారం



కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట : పద్మ విభూషణ్, పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన తెలుగు తేజాలను ఈ నెల 4న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు స్వయంగా ఫోన్ చేసి సత్కార కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ విషయాన్ని వెల్లంకిలోని కూరెళ్ల గ్రంథపాలకుడు తాటిపాముల స్వామి ధ్రువీకరించారు.

నేడు ధ్రువపత్రాల పంపిణీ

యాదగిరిగుట్ట : యాదాద్రి ఆలయ అభివృద్ధిలో భాగంగా దుకాణాలు కోల్పోయిన బాధితులకు వైటీడీఏ కాంప్లెక్స్‌లో కేటాయించిన షాపులకు సంబంధించి శనివారం ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ నర్సింగ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు రెడ్డి సత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వనున్నారు. ప్రధాన రహదారి, సర్కిల్ రోడ్డు పరిసరాల్లో దుకాణాలు కోల్పోయిన వారికి వైటీడీఏ కాంప్లెక్స్‌లో దుకాణాలు నిర్మించి కేటాయించినట్లు తెలిపారు.

పాఠశాలను సందర్శించిన డీఈఓ



విద్యార్థిని ప్రశ్నలు అడుగుతున్న డీఈఓ

భువనగిరి రూరల్ : మండలంలోని హన్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ నారాయణరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులు పరీక్ష రాస్తుండగా పరిశీలించారు. అలాగే 8వ తరగతి విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. పదో తరగతిలో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి ఉన్నారు.

చేనేత పాలసీ రూపొందించాలి

నల్లగొండ టూటౌన్ : చేనేత కోసం సమగ్ర పాలసీ రూపొందించాలని కోరుతూ తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ మాట్లాడుతూ చేనేత సహకార సంఘాల్లో, కార్మికుల వద్ద నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి టెస్కో పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.1200 కోట్లు కేటాయించాలని, చేనేత ముడి సరుకులపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆశావహులు ఎక్కువే!

ఎంపీ టికెట్ కోసం పలువురు నేతల పోటీ
- ప్రధాన పార్టీల్లో డిమాండ్
- కాంగ్రెస్‌లో ఇప్పటికే 27 దరఖాస్తులు
- సర్వేల ఆధారంగా గెలుపు గుర్రాలకు టికెట్‌లు



భువనగిరి ఎంపీ టికెట్ కోసం గాంధీభవన్‌లో దరఖాస్తు చేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

సాక్షి, యాదాద్రి : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో భువనగిరి ఎంపీ టికెట్ కోసం రేస్ మొదలైంది. అన్ని రాజకీయ పార్టీల్లో ఆశావహులు పెద్ద సంఖ్యలో పోటీపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే దరఖాస్తులు స్వీకరిస్తుండగా బీఆర్ఎస్, బీజేపీలు సర్వేలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. సర్వే నివేదికల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం ఉంది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ

ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ నెలకొంది. రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలని ఆ పార్టీ అధిష్టానం నిబంధనలు విధించడంతో ఆశావహులంతా గాంధీభవన్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 27 పీసీసీకి దరఖాస్తులు అందాయి. యాదాద్రి జిల్లా నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, నాయకులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సూర్యపవన్‌రెడ్డి, ఎల్లంల సంజీవరెడ్డితో పాటు మరొకరు ఉన్నారు. వీరితో పాటు మరికొందరు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. డీసీసీల నుంచి వచ్చిన దరఖాస్తులను పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ పరిశీలించారు.

సర్వే నివేదికలు ప్రామాణికంగా..

టికెట్ విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలు బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నాయి. ఇప్పటికే ఏఐసీసీ ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతుండగా పీసీసీ కూడా మరో సర్వే చేయిస్తోంది. దరఖాస్తుదారుల్లో ఎవరికి ప్రజాదరణ ఉంది, గెలుపు అవకాశాలు ఎవరికి ఉన్నాయనే అంశాలపై సర్వే చేయిస్తోంది. బీఆర్ఎస్ సైతం సర్వే చేయిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలు, పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే ప్రజలు ఏం కోరుతున్నారు, ఎవరిని బరిలోకి దించితే విజయావకాశాలు ఉన్నాయన్న కోణంలో సర్వే జరుగుతోంది. అభ్యర్థుల ఎంపికకు సర్వే కొంత ఉపయోగపడుతుందని ఆయా పార్టీలు విశ్వసిస్తున్నాయి.

బీజేపీలో..

భారతీయ జనతా పార్టీలోనూ టికెట్ కోసం పోటీ నెలకొంది. మోదీ చరిష్మాతో విజయం ఖాయమన్న ధీమాలో ఉన్న నాయకులు టికెట్ సాధించాలని పట్టుదలతో ఉన్నారు. 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున బరిలోకి నిలిచి ఓడిపోయిన డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ ప్రస్తుతం బీజేపీలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన పీవీ శ్యాంసుందర్‌రావు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. వీరిద్దరూ క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తూ జనంతో మమేకం అవుతున్నారు. పార్టీ పథకాలు, అభివృద్ధిని ప్రచారం చేయడంతో పాటు తమకున్న వ్యక్తిగత పరిచయాలతో జనంలోకి వెళ్తున్నారు.బూర నర్సయ్యగౌడ్, పీవీ శ్యాంసుందర్‌రావుతో పాటు మరికొందరు టికెట్ రేస్‌లో ఉన్నారు.

బీఆర్ఎస్‌లో ప్రయత్నాలు ముమ్మరం

పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి సారించింది. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలకు శ్రీకారం చుట్టింది. టికెట్ విషయంలోనూ ఆచితూచి వ్యవహరిస్తోంది. భువనగిరి, ఆలేరు మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్‌తోపాటు తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి, దూదిమెట్ల బాల్‌రాజ్‌యాదవ్, గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ కుమార్‌రెడ్డి టికెట్ రేసులో ఉన్నారు. అయితే ఉద్యమకాలంలో పనిచేసి పార్టీకి దూరమైన జిట్టా బాలకృష్ణారెడ్డి 14 ఏళ్ల తర్వాత రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిశారు. వచ్చే ఎన్నికల్లో తనకు ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరినట్లు సమాచారం.

భవిష్యత్తు మళ్లీ మనదే



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, వేదికపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

సాక్షి, యాదాద్రి : ఓటమి శాశ్వతం కాదని, గెలుపునకు నాంది పలికే స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని, కార్యకర్తలు అధైర్యపడవద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. భవిష్యత్తు మళ్లీ మనదేనని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరాలని, అందుకు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. రూ.3.87లక్షల కోట్ల అప్పును రూ.7లక్షల కోట్లుగా చూపి గ్లోబెల్స్ ప్రచారం చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెల్లోనే రూ.15 వేల కోట్ల అప్పులు తెచ్చారని పేర్కొన్నారు.

అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వృద్ధులు, దివ్యాంగులకు ఫించన్ పెంచకపోగా ఇస్తున్నది కూడా సకాలంలో రావడం లేదన్నారు. దళితబంధు నిధులను బ్యాంకుల్లో ఫ్రీజ్ చేసిందని ఆరోపించారు. ఎన్నికల హామీలను నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా మనం ప్రజల పక్షమన్నారు. అసెంబ్లీలో, ప్రజాక్షేత్రంలో నిరంతర పోరాటం సాగాలన్నారు. రైతుబంధు డబ్బులు పడలేదని జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి ప్రశ్నించినందుకు ఆయనను పోలీసులతో బయటికి పంపించడాన్ని తప్పుపట్టారు. కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని పార్టీ అండగా ఉంటుందన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామన్నారు. సమావేశానికి వేలాది మంది రావడం మన బలానికి చిహ్నమన్నారు. కార్యకర్తలు, నాయకులకు హరీశ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డి చేసిందేమీ లేదు: జగదీశ్‌రెడ్డి

25 ఏళ్లు ఎమ్మెల్యేగా, నాలుగేళ్లు ఎంపీగా ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ, భువనగిరికి ఏం చేశారని ప్రశ్నించారు. తమ హయాంలోనే మెడికల్ కళాశాలలు వచ్చాయని, రోడ్లు వేసి అభివృద్ధి చేశామన్నారు. రైతుబంధు గురించి సభలో మాట్లాడిన జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిని పోలీసులతో బయటకు పంపించడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పరువు పోయిందన్నారు. కాంగ్రెస్‌కు పాలించడం చేతకావడం లేదన్నారు.

ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవాలి : పైళ్ల

ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవాలని, మళ్లీ తప్పులు జరుగకుండా చూడాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు పార్టీకి ద్రోహం చేసిన వారున్నా అన్నీ మర్చిపోయి సమన్వయంతో కలిసిమెలిసి విజయం కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డిని కార్యకర్తలు సన్మానించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటీ సందీప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, కొలుపుల అమరేందర్, నల్లమాస రమేష్, సిద్దుల పద్మ, కర్నాటి అంజమ్మ, అబ్బగాని వెంకట్, మిర్యాల శ్రీనివాస్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ రెడ్డి, అంజనేయులు పంతులు, వనమాల కృష్ణ, గాదే నరేందర్‌రెడ్డితదితరులు మాట్లాడారు.



బాధ్యతల స్వీకరణ
రామన్నపేట మండలం నీర్నెముల గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎగ్జిబిట్‌కు ప్రత్యేక అవార్డు

భువనగిరి : హమాలీలు వస్తువులను సులభంగా లోడ్ చేసే విధంగా బీబీనగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సాయితేజచారి తయారు చేసిన ఎగ్జిబిట్‌కు ప్రత్యేక అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో జనవరి 27నుంచి 31వ తేదీ వరకు జరిగిన దక్షిణ భారత స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఆరు రాష్ట్రాల నుంచి 185 ప్రాజెక్టులు వచ్చాయి. ఇందులో బీబీనగర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి సాయితేజచారి, తుర్కపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన టి.వైష్ణవి ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. ఇందులో సాయితేజచారి రూపొందించిన ఎగ్జిబిట్‌కు ప్రత్యేక అవార్డు దక్కింది.



అవార్డు అందుకుంటున్న సాయితేజ చారి

'ఉపాధి హామీ'తో గ్రామాలు అభివృద్ధి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



ఉపాధిహామీ పథకం ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి రూరల్ : కూలీలకు పని దొరకడంతో పాటు గ్రామాల అభివృద్ధికి ఉపాధిహామీ పథకం దోహదపడుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం భువనగిరి మండలంలోని హన్మాపురంలో ఉపాధిహామీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, పాఠశాలల్లో టాయిలెట్లు, కిచెన్ షెడ్లు, వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం, నర్సరీ ప్లాంటేషన్, చెరువుల్లో పూడిక తీత తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కూలీలకు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా పని లభిస్తుందని, కుటుంబాలకు ఆర్థికంగా ఆసరా అవుతుందన్నారు. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు ఎక్కువ పనిదినాలు పూర్తి చేసిన కూలీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఎంపీడీఓ గుత్త నరేందర్‌రెడ్డి, ఏపీఓ బాలస్వామి, ఈసీ రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ సునంద, టెక్నికల్ అసిస్టెంట్ మానస, కంప్యూటర్ ఆపరేటర్లు దివ్య, కవిత పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తుర్కపల్లి : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. శుక్రవారం తుర్కపల్లి మండలంలోని రాంపూర్‌తండాలోని మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఇంటర్ విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరిశీలించారు. ప్రణాళికాబద్ధంగా చదువుకొని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు.అనంతరం పదో తరగతి విద్యార్థులకు విద్యబోధన, ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీఈఓ, ప్రిన్సిపాల్ మధు ప్రకాశ్ ఉన్నారు.

నిర్వహణకు నిధులేవీ?

- భారంగా ఉపాధిహామీ కార్యాలయాల నిర్వహణ
- 13 నెలలుగా నిధులు పెండింగ్
- చేతినుంచి చెల్లిస్తున్న అధికారులు



రామన్నపేటలోని ఉపాధిహామీ కార్యాలయం

రామన్నపేట : ఉపాధిహామీ పథకం అమలు చేసే కార్యాలయాల నిర్వహణకు నిధులు కరువయ్యాయి. 13 నెలలుగా మేయింటనెన్స్ గ్రాంట్స్ రాకపోవడంతో కార్యాలయాల నిర్వహణ అధికారులకు భారంగా మారింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో నిధులు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పని దొరక్క ప్రజలు వలస పోకూడదనే ఆశయంతో 2006 ఏప్రిల్ 1న అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని తీసుకువచ్చింది. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి అతని సొంత గ్రామంలోనే సంవత్సరానికి వందరోజుల పని కల్పించాలి. జిల్లాలో సుమారు 1.41లక్షల కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. జాబ్ కార్డుల్లో 2.61లక్షల మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం 95వేల మంది పనుల్లో పాల్గొంటున్నారు. ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ, అమలు కోసం ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వం భారత్ నిర్మాణ్ రాజీవ్‌గాంధీ సేవా కేంద్రం పేరుతో ఉపాధిహామీ కార్యాలయాలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి కార్యాలయంలో ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లను నియమించింది. గ్రామాల్లో క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్)లు పని చేస్తున్నారు. ఉపాధిహామీ కార్యాలయం నిర్వహణకు ప్రభుత్వం మేయింటనెన్స్ గ్రాంట్ ఇస్తుంది. 2022 వరకు ఖర్చు చేసిన బిల్లుల ఆధారంగా చెల్లింపులు జరిగేవి. 2022–23 ఆర్థిక సంవత్సరం నుంచి మేయింటనెన్స్ గ్రాంట్స్ చెల్లింపులో మార్పులు చేశారు. 2 లక్షల లోపు పనిదినాలకు రూ. 65 వేలు, 2 నుంచి 3 లక్షల పనిదినాలు ఉంటే రూ.85వేలు, 3 లక్షలపైన ఉంటే రూ.1లక్ష చొప్పున ఏడాదికి చెల్లిస్తున్నారు.

గ్రాంట్స్ కోసం ఎదురుచూపులు

ఉపాధిహామీ కార్యాలయాల నిర్వహణ కోసం ప్రతీ మూడు నెలలకు ఒకసారి విడుదల చేయవలసి ఉంది. కానీ, 2023 జనవరి నుండి పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్‌తోనే విద్యుత్, నెట్, వాటర్ బిల్లులు, స్కావెంజర్ చార్జీ చెల్లించవలసి ఉంటుంది. కంప్యూటర్ల రిపేర్, ప్రింటింగ్‌కు అవసరమైన క్యాట్రేజి, స్టేషనరీ కొనుగోలు చేయాలి. ఈ డబ్బులతో పంద్రాగస్టు, గణతంత్ర దినోత్సవం, రాష్ట్రావతరణ వేడుకలను నిర్వహించవలసి ఉంటుంది. కానీ, 13 నెలలుగా నిధులు రాకపోవడంతో కార్యాలయాల నిర్వహణ భారంగా మారింది.

సొంతంగా ఖర్చు

ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ఉపాధిహామీ కార్యాలయాల నిర్వహణ అధికారులకు భారంగా మారింది. ఉపాధిహామీ పనులు నిరంతర ప్రక్రియ కావడంతో సిబ్బంది రోజూ విధులకు హాజరవుతుంటారు. దీంతో విద్యుత్, వాటర్ తదితర బిల్లులు ప్రతి నెలా చెల్లించవలసిన పరిస్థితి. అయితే నిర్వహణ నిధులు రాకపోవడంతో ప్రతి నెలా విద్యుత్ బిల్లు తమ జేబులోనుంచి చెల్లించవలసి వస్తుందని అధికారులు అంటున్నారు. క్రమం తప్పకుండా నిర్వహణ నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

యాదాద్రిలో స్వాతి నక్షత్ర పూజలు



శ్రీస్వామి వారిని అభిషేకించేందుకు ప్రత్యేక కలశంలో జలాన్ని తీసుకెళ్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి సందర్భంగా ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాలయ ముఖ మండపంలో 108బంగారు, వెండి కలశాలలో శుద్ధజలం, సుగంధ ద్రవ్యాలను పోసి పూజలు చేసిన వాటితో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను అభిషేకించారు. అంతకుముందు ఆలయంలో హోమం నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. ఇక ఆలయంలో శ్రీస్వామి అమ్మవార్లకు ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలను విశేషంగా కొనసాగించారు.

విద్యార్థులకు కవితలు, పాటల పోటీలు

భువనగిరి : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా సుస్థిర అభివృద్ధి కోసం సైన్స్ వినియోగం అనే అంశంతో పాటు చిత్రలేఖనం, కవితలు, పద్యాలు, పాటలు, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. అన్ని రకాల పాఠశాలల్లోని 6నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈనెల 9లోపు పాఠశాల స్థాయిలో, 12న జిల్లా స్థాయి పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో రాణించిన వారిని ఈనెల 28న హైదరాబాద్‌లో జరగనునన్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థుల తమ వివరాలను forms.gle/RCUResg9Nrf87PVm6 ద్వారా పంపాలన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో కార్పొరేట్‌కే లాభం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాములు, చిత్రంలో జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

భువనగిరిటౌన్ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏమాత్రం ఆశాజనకంగా లేదని, కార్పొరేట్ కంపెనీలకే ప్రయోజనం చేకూర్చే విధంగా ఉందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేవిధంగా బడ్జెట్ ఉందన్నారు. విద్య వైద్య రంగాలను, ఉపాధి అవకాశాలను పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థులు, పేదలు, కార్మిక వర్గానికి ఆమదూరంలో ఉందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, జిల్లా కమిటీ సభ్యులు మాయ కృష్ణ, బొల్లు యాదగిరి, ఎండీ పాషా, పగిళ్ల లింగారెడ్డి, బబ్బులు పోశెట్టి, బొడ్డుపల్లి వెంకటేష్, గుంటూజు శ్రీనివాసాచారి, గుండు వెంకటనర్సు, గంగాదేవి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు

నల్లగొండ టౌన్ : తెలంగాణ ప్రభుత్వం, కార్మిక, ఉపాధి, శిక్షణ కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ టామ్‌కామ్ జపాన్ దేశంలో హాస్పిటాలిటీ రంగంలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా లేదా డిగ్రీ, 22 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. పేర్ల నమోదు కోసం టామ్‌కామ్ హెచ్‌ఆర్ మేనేజర్ 8125251408 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

నార్కట్‌పల్లి: వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాతిశ్యాహం అనే వ్యక్తి స్థానిక రాశీ రీఫ్యాక్టర్ కంపెనీలో ఉద్యోగ రీత్యా కొన్ని ఏళ్ల క్రితం వచ్చి ఇక్కడ పని చేస్తున్నాడు. నెల రోజుల క్రితం డ్యూటీకి రాకపోవడంతో తన స్నేహితుడు సొంత ఊరికి వెళ్లాడనుకొని ఇంటికి ఫోన్ చేశాడు. అక్కడకి రాలేదన్న సమాచారంతో తోటి ఉద్యోగి రామ్ జిట్ కెహాన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఔషధ దుకాణాలపై అధికారుల దాడులు



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కోదాడ: పట్టణంలోని పలు ఔషధ దుకాణాల్లో శుక్రవారం అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న ఓ మందుల దుకాణంపై కేసు నమోదు చేశారు. వారు మాట్లాడుతూ బిల్లులు లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని దుకాణాల్లో ఆర్‌ఎంపీలకు అధిక మోతాదులో మందులు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. తనిఖీల్లో అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ దాసు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

4న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, సతీష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అండర్ 9, 11, 13, 15 విభాగాల్లో బాల, బాలికలు పాల్గొనాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆదివారం ఉదయం 10గంటల లోపు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. చెస్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సూర్యాపేట అర్బన్, రూరల్‌లో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ 18 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీకి ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి కోటాచలం శుక్రవారం తెలిపారు. ఈ నెల 12న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

రామన్నపేటలో పెద్దపులి కలకలం!

- పులి సంచరిస్తుందన్న సమాచారంతో వణికిపోతున్న జనం
- గాలిస్తున్న అటవీ, పోలీసుశాఖ సిబ్బంది



రైల్వేట్రాక్‌పై పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, స్థానికులు

రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రం శివారులో పెద్దపులి సంచారం కలకలం సృష్టిస్తోంది. గూడ్స్ రైలు గార్డ్ (సీఎంసీఎస్) సమాచారంతో పోలీసు, రైల్వే అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి కదలికలను గుర్తించేందుకు ఆయా శాఖల అధికారులు సిబ్బంది రంగప్రవేశం చేశారు. పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. చిట్యాల నుంచి బీబీనగర్ వైపు శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గూడ్స్ రైలు వెళ్లింది. రైలు చివరి క్యాబిన్‌లో గార్డ్ డ్యూటీ చేస్తున్న వ్యక్తి 45కి.మీ మైలురాయి వద్ద (హరిహరపుత్ర రైసుమిల్లు) పెద్ద పులి రైల్వేట్రాక్‌ను దాటి కొమ్మాయిగూడెం వైపు వెళ్లడం చూశానని రామన్నపేట రైల్వేస్టేషన్ మాస్టర్‌కు తెలిపాడు. ఈ విషయాన్ని రైల్వే ఉన్నతాధికారులతో పాటు పోలీసు, అటవీశాఖ అధికారులకు చేరవేశాడు. వారు ట్రాక్‌పై పనిచేసే సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని మెసేజ్ పంపారు. సమాచారం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, అటవీశాఖ పోలీసు సిబ్బంది, స్థానికులతో కలిసి 45వ నంబర్ మైలురాయి పరిసరాల్లో పర్యటించారు. పులి కనిపించిన ప్రాంతం వద్ద రైతులు, గొర్ల కాపరుల సంచారం ఎక్కువగా ఉండడంతో అధికారులు వారిని అప్రమత్తం చేశారు. పులి సంచారానికి సంబంధించిన వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కొమ్మాయిగూడెం, పెద్దకాపర్తి, సిరిపురం, జనంపల్లి, బోగారం తదితర గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. పులి సంచారంపై డీఎఫ్ఓ శోభారాణిని సంప్రదించగా ఈ ప్రాంతంలో పెద్దపులులు లేవని, అలాగని పులి సంచరించలేదని చెప్పలేమని తెలిపారు. అటవీశాఖ సిబ్బంది పులి కదలికలను తెలుసుకునేందుకు ఫీల్డ్‌మీదికి వెళ్లినట్లు చెప్పారు. కాగా.. రాత్రి వరకు పులిజాడ తెలియరాలేదు. పులిని చూసిన గార్డ్ మొబైల్‌ఫోన్ క్యాబిన్‌లోని బ్యాగులో ఉండడం, రైలు 50 నుంచి 60 కి.మీ వేగంతో వెళ్లడంతో ఫొటో తీయలేకపోయినట్లు తెలుస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి

రామన్నపేట శివారులో పులి కనిపించిందనే సమాచారం అందింది. వెంటనే పోలీసు సిబ్బంది పులి కనిపించిన ప్రదేశానికి వెళ్లి చూశాం. రైతులు, గొర్లకాపరులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయబావుల వద్దకు గుంపులుగా వెళ్లాలి. పులి కనిపిస్తే సమాచారం అందించాలి.

– వెంకటేశ్వర్లు, సీఐ, రామన్నపేట

ఘనంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నల్లగొండ పట్టణంలోని గుత్తా క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి రక్తదానం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, కనగల్ ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, యామ కవిత దయాకర్, నాయకులు అయితగాని స్వామిగౌడ్, హరికృష్ణ, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి, అనిస్ముక్తర్, హున్ను, వంగాల సహదేవరెడ్డి, ఆలకుంట్ల నాగరత్నంరాజు, మాలె శరణ్యారెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి, చిత్రంలో చాడ కిషన్‌రెడ్డి తదితరులు

మత్తు ఇంజక్షన్లకు యువత బానిస

- నల్లగొండలో పలువురి యువకుల వద్ద మత్తు టాబ్లెట్లు, ఇంజక్షన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ చందనాదీప్తి



మత్తు టాబ్లెట్లు, ఇంజక్షన్‌లను చూపుతున్న నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: నల్లగొండలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వైద్యుడి సిఫారసు లేకుండా మత్తుకు సంబంధించిన స్పాస్మో ప్రాక్సివాస్ ప్లస్, అల్ట్రా కింగ్ టాబ్లెట్‌లు, ట్రామాడెక్స్ ఇంజక్షన్‌లు కలిగిన ఉన్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా కొత్త తరహాలో మత్తు మందుకు యువత బానిస అవుతున్నట్లు బయటపడింది. నిందితులను, మత్తు మందులను అమ్మిన వారిని అరెస్ట్ చేసి, వారి దగ్గర మత్తు మందులకు సంబంధించిన టాబ్‌లెట్స్, ఇంజక్షన్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి శుక్రవారం వివరాలు వెల్లడించారు. నల్లగొండ పట్టణంలోని రహ్మాన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ జబీఉల్లా, ఎన్‌జీ కాలేజీ వెనుక బాగంలోని శ్రీనగర్‌కాలనీ చెందిన మహ్మద్ సల్మాన్ మత్తు మందులతో పట్టుబడినట్లు తెలిపారు. వీరిద్దరు శివాజీనగర్‌లోని న్యూ హెల్త్‌కేర్ ఫార్మసీకి చెందిన యజమాని తాడోజు నరేష్ వద్ద మత్తు మందులు కొనుగోలు చేసినట్లు చెప్పారు. కొందరు యువకులు మత్తు టాబ్లెట్లను, ఇంజక్షన్లను తాము తీసుకోవడమే కాకుండా తమ ఇళ్లలో నిల్వ చేసుకుని ఇతరులకు కూడా విక్రయిస్తున్నారని ఎస్పీ చెప్పారు. ఈ మత్తు టాబ్లెట్లను మింగి పైనుంచి చక్కెర నీళ్లు తాగడం వల్ల ఎక్కువ మత్తు వస్తుందని, గంజాయి పీల్చిన దానికంటే ఎక్కువ మత్తులోకి జారుకుంటారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచామని, క్రయ, విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు. మత్తు పదార్థాల సమాచార విషయంపై సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, 100 నంబర్‌కు డయల్ చేసి గానీ తెలియజేయాలని కోరారు. కొత్త తరహాలో మత్తుకు బానిస అవుతున్న యువతను కట్టడి చేసి మంచి మార్గంలో నడిపించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు. నేరస్తులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లు.. నివారణ చర్యలు


- మోతాదు ప్రకారం పురుగు మందులు వాడితే మంచి దిగుబడులు
- నడిగూడెం వ్యవసాయాధికారి రాజగోపాలరావు సూచనలు



అగ్గి తెగులు సోకిన వరి పైరు



సాగులో ఉన్న వరి చేను



నడిగూడెం: ప్రస్తుత రబీ సీజన్‌లో వరి పంట పెరిగే దశలో, పలు ప్రాంతాల్లో పిలకల దశలో ఉంది. ప్రస్తుతం చల్లని వాతావరణం ఉండడంతో వరి పంటలో చీడపీడలు ఆశించి నష్టపరుస్తున్నాయి. ఈ దశలో ఇష్టారాజ్యంగా పురుగు మందులు వాడొద్దని.. మోతాదు ప్రకారమే వాడాలని, నివారణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఆశించే పురుగులు.. నివారణ చర్యలు

కాండం తొలుచు పురుగు: ఈ పురుగు నారుమడి, పిలకదశ, అంకురం నుంచి చిరు పొట్టదశ వరకు ఆశిస్తుంది. పిలక దశలో మొవ్వ చనిపోతుంది. అంకురం నుంచి చిరు పొట్టదశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి. కంకి పాలు పోసుకోక తాలు పోతుంది. ఈ పురుగు ఆలస్యంగా నాట్లు పెట్టినా లేదా ముదురు నాట్లు పెట్టినా ఆశిస్తాయి. నత్రజని ఎరువులు తక్కువగా వాడడం వలన కాండం బలహీనంగా మారినప్పుడు ఈ పురుగు ఆశిస్తుంది.

నివారణ చర్యలు: నాట్లు ఆలస్యమైనప్పుడు నారు కొనలు తుంచి వేయాలి. ఎకరానికి మూడు లింగాకర్షక బుట్టలు పెట్టి ప్రతి వారం బుట్టలో పడే మగరెక్కల పురుగులను గమనించి నష్ట పరిమితి స్థాయి దాటినప్పుడు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలి. కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రినిల్‌ప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సుడిదోమ (దోమపోటు): ఈ పురుగు నారు మడి లేదా పిలకల దశలో అరుదుగా, పొట్టదశ, ఈనిక దశల్లో ఎక్కువగా ఆశిస్తుంది. నీటి పైభాగంలో మొక్కల మొదళ్ల దగ్గర దోమలు కనబడతాయి. పిల్ల, పెద్ద పురుగులు రసాన్ని పీల్చటం వల్ల పైరు సుడులుగా ఎండిపోతుంది. ఉధృతి ఎక్కువగా ఉంటే పొలం ఎండిపోయి పడిపోవడం, తాలుగింజలు లేదా నూర్చినప్పుడు నూకపోవడం జరుగుతుంది.

నివారణ చర్యలు: దోమను తట్టుకునే రకాలు సాగు చేసుకోవాలి. నత్రజని అధిక మోతాదు తగ్గించుకోవాలి. కాలిబాటలు తీయాలి. ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేదా ఎథోఫెన్‌ప్రాక్స్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఉల్లికోడు లేదా గొట్టపు రోగం : ఇది నారుమడి, పిలక దశలో ఆశిస్తుంది. అంకురం ఉల్లికాడ లాగా పొడగాటి గొట్టంలా మారి బయటకు వస్తుంది. కంకి వేయదు. దుబ్బుల్లో కొన్ని పిలకలు ఉల్లికాడవలె పొడగాటి గొట్టాలుగా మారతాయి. సెప్టెంబరులో 200 మి.మీ. కంటే ఎక్కువ వర్షం పడితే ఇది వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు: దీనిని తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను 10కిలోలు లేదా ఫోరెట్ 10జి గుళికలను 5 కిలోలు ఎకరానికి నాటిన 10నుంచి 15 రోజులకు వేసుకోవాలి.

పాముపొడ తెగులు: దుబ్బు చేసు దశ నుంచి కాండం, మట్ట, ఆకులపై మచ్చలు పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. మొక్కలు, పైరు పూర్తిగా ఎండిపోతుంది. తెగులు వెన్ను వరకు వ్యాపిస్తే తాలుగింజలు ఏర్పడతాయి.

నివారణ చర్యలు: విత్తన శుద్ధి చేయాలి. సిఫారసు మేరకు నత్రజని ఉపయోగించాలి. గట్లపై, చేనులో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. హెక్సాకొనాజోల్ 2. మి.లీ. లేదా ప్రాపికొనాజోల్ 1 .మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అగ్గితెగులు : తొలిదశలో ఆకులపైన నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా అనుకూల వాతావరణ పరిస్థితుల్లో ఇది విస్తరించి మచ్చలు చివర్లు మొనదేలి ఉంటాయి. ఈ మచ్చల అంచులు ముదురు గోధుమ లేదా నలుపు రంగులో ఉండి ఆకులు కాలిపోయినట్లుగా వ్యాపించి నష్టపరుస్తుంది. వరి దుబ్బుల్లో, వరి గడ్డిపైన, కలుపు మొక్కల్లో స్థావరం ఏర్పరచుకొని అనుకూల పరిస్థితుల్లో వరి పైరుపై ఆశిస్తుంది. నత్రజని ఎరువుల అధిక మోతాదుల్లో వాడటం, గాలిలో తేమ అధికంగా ఉండడం, మబ్బుతో కూడిన వాతావరణం, సన్నని వర్షపు జల్లులు, ఉష్ణోగ్రత 25–30 సెల్సియస్ మధ్య ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాప్తిస్తుంది.

నివారణ చర్యలు: విత్తనశుద్ధి చేయాలి. పైరుపై తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే పొలంలో నీటిని తీసి బాగా ఆరనివ్వాలి. దీని వలన శిలీంద్రం తాలూకు సిద్ధ బీజాలు నశిస్తాయి. ట్రైసైక్లేజోల్ 1.5గ్రాములు లేదా కాసుగామైసీన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మహిళను వేధించిన కేసులో నిందితుడికి జైలు

శాలిగౌరారం: మహిళను వేధించిన కేసులో శాలిగౌరారం మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన నిందితుడికి జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ సతీష్ శుక్రవారం తెలిపారు. ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన బాషబోయిన నాగయ్య(35) 2015లో అదే గ్రామానికి చెందిన ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ మహేశ్ 36/2015 ఐపీసీ 354 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. కోర్టులో వాదోపవాదనల అనంతరం మహిళను వేధించిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు బాషబోయిన నాగయ్యకు శుక్రవారం నకిరేకల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరీఫ్ సంవత్సరం జైలు శిక్షతో పాటూ రూ.2 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో నెల రోజుల జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. ఈ కేసును అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.లక్ష్మణ్ వాదించారు. నేరం రుజువు చేసేందుకు ఆధారాలను నిర్ణీత సమయంలో కోర్టులో సమర్పించిన లైజనింగ్ అధికారి రవి, కోర్టు కానిస్టేబుల్ రమేశ్‌లను ఎస్ఐ సతీష్ అభినందించారు.

నీటిని విడుదల చేయాలని మంత్రికి వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, ఎస్‌ఎల్‌బీసీ, వరద కాల్వకు నీటిని విడుదల చేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రానున్న వేసవికాలంలో ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాలు పెంచేందుకు తక్షణమే ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాల్సిన అవసరం ఉందన్నారు. చెరువులు, కుంటలను నింపితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. స్పందించిన మంత్రి ఉత్తమ్ ఎన్ఎస్‌పీ ఎస్ఈకి ఫోన్ చేసి నీటి విడుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, బండా శ్రీశైలం, పారేపల్లి శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

8న పోలీస్ వాహనాల పాత సామగ్రి వేలం

సూర్యాపేట క్రైం: జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ కార్యాలయంలో ఈ నెల 8న పోలీస్ వాహనాల పాత సామగ్రిని బహిరంగ వేలం వేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ వాహనాలకు ఉపయోగించిన 113 టైర్లు, ట్యూబ్‌లు, 46 బ్యాటరీలతోపాటు ఇతర సామగ్రి ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు పోలీస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి సురేష్ 8712686019ను సంప్రదించాలని కోరారు.

10న కోదాడ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక

కోదాడ: గత నెల 27న కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఖాళీ అయిన ఆ రెండు పదవులకు ఈ నెల 10న ఎన్నిక నిర్వహించడానికి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసినట్లు కోదాడ మున్సిపల్ కమిషనర్ శుక్రవారం తెలిపారు.

కందులు క్వింటా రూ.10,217

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం కందులకు రికార్డు ధర పలికింది. వ్యవసాయ మార్కెట్ యార్డుకు 544 బస్తా కందులు రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.10,217 కనిష్ఠంగా రూ.8,089 ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. కందులకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7వేలు ఉంటే అంత కంటే అధిక ధర పలకడం ఈ సీజన్‌లో ఇదే తొలిసారి అని ఆయన తెలిపారు.



తిరుమలగిరి మార్కెట్‌లో కందుల రాశులు

ప్రేమ జంటలను వేధిస్తున్న ముఠా

- సన్నిహితంగా ఉన్న సమయంలో రహస్యంగా వీడియోలు తీస్తున్న యువకులు
- బ్లాక్‌మెయిల్ చేసి నగదు, బంగారు ఆభరణాలు దోపిడీ
- మహిళలపై లైంగికదాడికి పాల్పడుతున్న గ్యాంగ్
- పరువుపోతుందని బయటికి చెప్పని బాధితులు

నల్లగొండ క్రైం: ప్రేమజంటలు సన్నిహితంగా ఉన్న సమయంలో ఓ సైకో గ్యాంగ్ సెల్‌ఫోన్‌లో రహస్యంగా వీడియోలు తీసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. వీడియోలు చూపించి వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు దోచుకుంటున్నారు. అంతేకాకుండా మహిళలు, యువతులపై లైంగికదాడికి పాల్పడుతున్నారు. నల్లగొండ పట్టణంలోని నార్కట్‌పల్లి – అద్దంకి ప్రధాన రహదారి పానగల్ బైపాస్ సమీపంలోని నంద్యాల నరసింహారెడ్డి కాలనీ వద్ద ఈ గ్యాంగ్ వ్యవహారం బయటపడింది. వీరు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. నల్లగొండ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఆరుగురు యువకులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. నల్లగొండ పట్టణానికి చెందిన కొందరు ప్రేమ జంటలు, వివాహేతర సంబంధం ఉన్న వారు చెట్లపొదల మధ్య సన్నిహితంగా ఉండడాన్ని పసిగట్టి సెల్‌ఫోన్‌లో రహస్యంగా వీడియో తీసి ఆయా జంటలను బ్లాక్ మెయిల్ చేసి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదు దోచుకుంటున్నారు. ఎవరికైనా చెప్తే మీ ఇంట్లో వాళ్లకు ఈ వీడియోలు పంపుతామని, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇస్తేనే వీడియోలను డిలీట్ చేస్తామని వారికి ఫోన్ కాల్స్ చేస్తున్నారు. దీంతో పరువు పోతుందని, వివాహేతర సంబంధం బయటపడుతుందనే ఉద్దేశంతో ఈ విషయాలను బాధితులు ఎవరికీ చెప్పడం లేదు. గత మూడేళ్లుగా ఈ వ్యవహారం నడుస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

వెలుగులోకి ఇలా..

ఓ యువకుడు తన ప్రియురాలిని తీసుకొని నంద్యాల నరసింహారెడ్డి కాలనీ సమీపంలోని నిర్మానుశ్య ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. వారు సన్నిహితంగా ఉన్న సమయంలో గ్యాంగ్‌లోని యువకులు యువతిని బలవంతంగా కొట్టి లైంగిక దాడికి పాల్పడి వీడియో తీశారు. వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు లాక్కున్నారు. అదే సమయంలో వివాహేతర సంబంధం కలిగిన మరో జంట పై ఇదే తరహాలో దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఓ వ్యక్తి పోలీసుల దృష్టికి తీసుకురావడంతో ఆరుగురు ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారిస్తున్నట్లు తెలిసింది. దోపిడీ చేసిన నగదు, బంగారు ఆభరణాలు రికవరీ చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే.. అనేక మంది మహిళలు బాధితులుగా ఉన్నట్లు ఫోన్ కాల్‌డేటా ఆధారంగా తెలుస్తోంది. ఈ విషయంపై నల్లగొండ టూటౌన్ ఎస్సై నాగరాజును వివరణ కోరగా.. ఆ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసుల బృందం గాలిస్తున్నట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FOR SALE

■ యాదాద్రి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో కస్తూర్బా గాంధీ స్కూల్ వెళ్ళే దారిలో మెయిన్ రోడ్‌కు దగ్గరలో అన్ని సదుపాయలతో గల రెండు 2BHK (145 Sq. Yds), East Face బిల్డింగ్స్ సరసమైన రేట్లలో అమ్మకానికి కలవు. డైరెక్ట్ ఓనర్ సెల్ : 9493894343, 9848084343 [Y-784296]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233768]

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు, వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 20k ఫోన్: 8977639662/8977639663. [H-793685]

Services

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ.:220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి తదుపరి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్ రికవరీ బ్రాంచ్-1 (కోడ్-05172)
2వ అంతస్తు, TSRTC కమ్యూటర్ ఎమెనిటీ సెంటర్, బస్ టెర్మినల్ కాంప్లెక్స్, కోఠి, హైదరాబాద్ - 500095, తెలంగాణ రాష్ట్రం. ఇ-మెయిల్: sbi.05172@sbi.co.in

ఇ-వేలం అమ్మకం ప్రకటన
అనుబంధం - IV A (రూల్ 8 (6)కు నిబంధనలు చూడండి)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధలతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ చార్జ్‌చేసిన దిగువ వివరించిన స్థిరాస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన అధీకృత అధికారిచే లాంఛనప్రాయ స్వాధీనంలోకి తీసుకోబడినదని, రుణగ్రహీత: మెసర్స్ KR ఎంటర్‌ప్రైజెస్, భాగస్వాములు: శ్రీ కుందారపు అశిష్‌రాజ్ మరియు శ్రీమతి కె. నాగలక్ష్మి, నం.3-215/ఎ, శాంతినగర్, ఉప్పల్ మెయిన్ రోడ్డు, భారత్ పెట్రోల్ పంప్ ఎదురుగా, ఉప్పల్, హైదరాబాద్, తెలంగాణ - 500039 తో పాటు వారి భాగస్వాములు మరియు గ్యారంటార్లు (1) శ్రీ కుందారపు అశిష్‌రాజ్ తండ్రి శ్రీ కె. రాజాచారి, (2) శ్రీ కె. రాజాచారి తండ్రి శ్రీ కె. సర్వయ్య, నివాసం: ఇ.నం.2-3-676/3/152, లలితానగర్, రోడ్ నం.9, గ్రీన్‌ల్యాండ్స్ దాబా రోడ్డు, నాగోల్, ఎల్బీనగర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా - 500039 మరియు (3) మెసర్స్ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహించు ప్రొప్రైటర్ శ్రీమతి కె. నాగలక్ష్మి, సర్వే నం.860 భాగం, CFC ప్లాట్ నం.A, IDA భువనగిరి, యాదాద్రి భువనగిరి, తెలంగాణ - 508116 వారి నుండి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం 20-10-2023 నాటికి రూ.4,19,41,280/- (నాలుగు కోట్ల పంతొమ్మిది లక్షల నలభైఒక్క వేల రెండువందల ఎనభై రూపాయలు మాత్రమే) మరియు 21-10-2023 నుండి వడ్డీతో పాటు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొదలగునవి రాబట్టుకొనుటకు సదరు ఆస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏమున్నదో అదే" ప్రాతిపదికన 06-03-2024న విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(ల)కు/ గ్యారంటార్(ల)కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

ఆస్తి ఐడీ: SBIN78156792827: SRO భువనగిరి వద్ద నమోదైన రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.1386/2009, తేది 06-04-2009 ప్రకారం మెసర్స్ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహించు ప్రొప్రైటర్ శ్రీమతి కె. నాగలక్ష్మి భర్త శ్రీ కె. రాజాచారికి చెందిన ఇండస్ట్రియల్ పార్కు, భువనగిరి మున్సిపాలిటీలోని భువనగిరి గ్రామం, తెలంగాణ - 508116 వద్దగల సర్వే నం.860 భాగం, APIIC-IALA, భువనగిరిలోని CFC ప్లాట్ నం.A కలిగిన 630 చ.మీటర్లు లేదా 753.48 చ.గజాల విస్తీర్ణంగల ఖాళీ భూమి యావత్తు మరియు సరిహద్దులు:- తూర్పు: రోడ్డు, పశ్చిమం: CFC ప్లాట్ నం.B, ఉత్తరం: ప్రజల ఉపయోగార్థం సైట్, దక్షిణం: లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ప్లాట్.

రిజర్వు ధర: రూ.1,61,00,000/- ; బయానా: రూ.16,10,000/-, బిడ్ ఇంక్రిమెంట్: రూ.1,00,000/-
వేలం తేది: 06-03-2024; వేలం సమయం: ఉ.10.00 గం. నుండి మ.01.00 గం. వరకు
ఆస్తి తనిఖీ తేది మరియు సమయం:
10-02-2024 నుండి 03-03-2024 వరకు ఉ.11.00 గం. నుండి సా.4.00 గం. మధ్య

1) అధీకృత అధికారి ఉత్తమ పరిజ్ఞానం మరియు సమాచారం మేరకు ఏ ఆస్తిపైనా తాకట్టు రుణభారాలు లేవు. అయితే, కాబోరు బిడ్డర్లు తమ బిడ్ దాఖలు చేయుటకు ముందు వేలమునకు ఉంచబడిన ఆస్తి/ ఆస్తుల తాకట్టు రుణభారాలు, టైటిల్ మరియు ఆస్తిని ప్రభావితం చేసే క్లెయిమ్‌లు/ హక్కులు/ బకాయిలకు సంబంధించి తమ స్వంత స్వతంత్ర విచారణలు జరుపుకోవలెను. ఏవేని స్పష్టీకరణలు లేదా తదుపరి వివరాల కోసం అధీకృత అధికారి, శ్రీ డి.జి. సురేష్ ఆత్రేయ, 9440201771, 7386623173 వారిని సంప్రదించండి మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ MSTC లిమిటెడ్‌ను వెబ్ పోర్టల్ https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp హెల్ప్ లైన్ నం. +91-033-40645207, 40609118, 40645316, 22831002, 22891401, 22891005, 22901004, 22895064, ఇ-మెయిల్ ఐడీ: helpdesk@mstcindia.co.in లో కూడా ఇ-వేలం తేదీకి ముందు సంప్రదించవచ్చును.
2) వర్తించే స్టాంప్ సుంకాలు/ అదనపు స్టాంప్ సుంకం/ ట్రాన్స్‌ఫర్ చార్జీలు/ రుసుము మొ.వి మరియు ఎవరికైనా చెల్లించవలసిన అన్ని చట్టబద్ధమైన/ చట్టబద్ధంకాని బకాయిలు, పన్నులు, రేట్లు అసెస్‌మెంట్ చార్జీలు, ఫీజు మొ.వాటిని కూడా కొనుగోలుదారే భరించవలెను.
3) ఆసక్తిగల బిడ్డరు ప్రీ-బిడ్ బయానాను ఇ-వేలం ముగిసేలోగా MSTC వద్ద డిపాజిట్ చేయవలెను. ప్రీ-బిడ్ బయానా క్రెడిట్ MSTC బ్యాంకు ఖాతాలో పేమెంట్ స్వీకరణ తరువాత మరియు అట్టి సమాచారం ఇ-వేలం వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసిన తరువాత మాత్రమే ఇవ్వబడుతుంది. బ్యాంకింగ్ ప్రాసెస్ ప్రకారం ఇది కొంత సమయం తీసుకుంటుంది కాబట్టి బిడ్డర్లు వారి స్వంత ప్రయోజనం మేరకు ఏదేని చివరి నిమిషం సమస్యను నివారించడానికి తగినంత ముందుగా ప్రీ-బిడ్ బయానా మొత్తాన్ని దాఖలు చేయాలని సూచించడమైనది.
4) ఆదాయపన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-IA ప్రకారం ఎప్పుడైతే అమ్మకం ప్రతిఫలం రూ.50,00,000/- (రూపాయలు యాభై లక్షలు) మరియు ఆపైన ఉంటే అమ్మకం ప్రొసీడ్స్‌పై 1% వంతున TDS వర్తిస్తుంది. సఫలీకృత బిడ్డరు/ కొనుగోలుదారు సదరు TDSను ఫారం నం.16-Bలో IT శాఖకు డిపాజిట్ చేయడం ద్వారా చెల్లించవలెను మరియు TDS సర్టిఫికెట్ యొక్క ఒరిజినల్ రశీదును బ్యాంకుకు దాఖలు చేయవలెను (స్థిరాస్తికి, వ్యవసాయ భూమి కాని వాటికి వర్తిస్తుంది).
5) అమ్మకం యొక్క సవివరమైన నియమనిబంధల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ (a) "http://www.sbi.co.in" (b) https://ibapi.in లో ఏర్పాటు చేసిన లింకును రిఫర్ చేయండి.

తేది: 31-01-2024 ప్రదేశం: హైదరాబాద్
సం/- అధీకృత అధికారి/ చీఫ్ మేనేజర్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SARB-1, కోఠి, హైదరాబాద్